

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 20 ఫిబ్రవరి 2025 పేజీలు : 04


# వేతనాలు అందక..వెతలు తీరక..!

- అయ్యగారికి దండం..అమ్మగారికి దండం అంటూ కార్మికుల ప్రదక్షిణ.
- సర్పంచి, ఈవో వివాదంతో పారిశుద్ధ్య కార్మికులకు తీరని వేతన యాతన.
- కలెక్టర్ దృష్టికి వెళ్లినా యాడికి 'పంచాయితీ'కి లభించని పరిష్కారం.



యాడికి పంచాయతీ కార్యాలయం



వినతిరూపంలో వేతన వెతలు చూపుతున్న కార్మికులు

**యాడికి(తాడిపత్రి), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

"ఇంటికి బాడుగ..కరెంటు బిల్లు..గ్యాస్ సిలిండరు..పిల్లల ఫీజులు కట్టాలంటే డబ్బులు లేవు. వేతనం రాకపోయినా అతి కష్టం మీద మూడు నెలలు లాగేశాం. నాలుగు నెలల నుంచి జీతాల్లేవు. ఇక మావల్ల కాదయ్యా.. వేతనాలిప్పించండి" అంటూ యాడికి పంచాయతీలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఉన్నతాధికారుల వద్ద, ప్రజాప్రతినిధుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఈవో సర్పంచి మీద, సర్పంచి పంచాయతీ ఈఓ మీద సాకులు చెబుతూ తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. బుధవారం కార్మికులందరూ కలసి ఏకంగా తాడిపత్రిలోని ఓ ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయగా అక్కడా వారికి నిరాశే ఎదురైంది. కార్మికుల తరపున వారి సమస్యను ఆ ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకొనిపోయి ఆయన సమాధానం మోసుకు వచ్చిన అనుచరుడు ఒకరు తమను సైడు కాలువలోని నీరుతాగి కానీ పనిచేయాల్సిందే అంటూ..మీరు గెలిపించుకున్న వైసీపీ సర్పంచే కదా మీరే ఆమెను అడగండని వెనక్కు పంపినట్లు కార్మికులు వాపోయారు.



అయ్యగారికి దండం పెడదామంటే అందుబాటులో ఉండరు..?

**:ఈవోపై కలెక్టరుకు, మాజీ ఎమ్మెల్యేకు సర్పంచి ఫిర్యాదు..!**

యాడికి పంచాయతీ ఈవో అశ్వర్థ నాయుడు విధులకు సక్రమంగా రావడం లేదని, నెలలో 10 రోజులకు మించి విధులకు హాజరు కావడం లేదని, విధుల్లో చేరినప్పటి నుంచి ఇదే తంతు కొనసాగుతోందని సర్పంచి అనురాధ ఇటీవల శింగనమలలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచి ప్రమేయం లేకుండా గ్రామసభలు నిర్వహించడం,తీర్మానాలు చేసి పనులు చేపట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నాడని ఈవోపై ఆమె పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.అయితే ప్రస్తుత పంచాయతీ ఉన్నతాధికారి ఒకరితో అత్యంత సన్నిహితంగా ఉన్న ఈవోపై ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోలేరని అక్కడి సిబ్బందే తమతో తెలిపారని, ఫిర్యాదు చేసి 15 రోజులు పూర్తయినా ఈఓపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో డీపీవో సిబ్బంది చెప్పిందే వాస్తవమని అర్థమవుతోందని సర్పంచి అనురాధ అంటున్నారు.పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలతో పాటు పంచాయతీ పరిధిలో తాము చేపట్టిన పనులకు బిల్లులు పెట్టమంటే ఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆమె ఆరోపిస్తున్నారు. తాము ఈవోను తమ వేతనాల విషయం అడుగుతుంటే సర్పంచిని అడగమంటున్నారని కార్మికులు కూడా చెబుతున్నారు. ఇటీవల కత్తిమానుపల్లి గ్రామస్థులు సర్పంచి అనురాధ సమక్షంలోనే ఫోను ద్వారా తమ గ్రామంలోని తాగునీటి సమస్యను ఈవో దృష్టికి తీసుకొని పోవడం, ఆయన ఓ అధికార పార్టీ నాయకున్ని సంప్రదించమని గ్రామస్థులకు సూచించడం చర్చనీయాంశంగా మారింది. సర్పంచిని సంప్రదించమని కాని, ఆయనే పరిష్కరిస్తానని కాని చెప్పకుండా సంబంధం లేని ఓ చోటానాయకున్ని



అమ్మగారికి మొరపెట్టుకుంటున్న కార్మికులు

సంప్రదించమని చెప్పడమేంటని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇలాంటి ఈవో వ్యవహారంపై ఇటీవల యాడికికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే దృష్టికి సర్పంచి అనురాధ తీసుకోనిపోగా ఆయన కూడా ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

**ఈవోఆర్డీకి మొరపెట్టుకున్న కార్మికులు**

ప్రజా ప్రతినిధులు, సర్పంచి, నాయకులు, ఈవో చుట్టూ నాలుగు నెలలుగా తిరిగి విసిగిపోయిన కార్మికులు చివరి ప్రయత్నంగా బుధవారం ఈవోఆర్డీ శశికళతో కూడా తమ గోడును మొరపెట్టుకున్నారు. మేజర్ పంచాయతీ అయిన యాడికిలో 30 మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు, నలుగురు స్వచ్ఛభారత్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో స్వీపర్లు, వాటర్‌మెన్లు, బిల్లు కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు రోజువారీ విధుల్లో ఉంటూ నాలుగు నెలలుగా వేతనాలు పొందడం లేదు. స్వయం సహాయక సంఘాల కంతులు కూడా సకాలంలో చెల్లించలేక అవమానాలు ఎదుర్కొంటున్నామని, మా వేతనాల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్న ఈవో, సర్పంచిలపై తగిన చర్యలు తీసుకునేలా డీపీవో, కలెక్టర్ల దృష్టికి తమ వినతిని తీసుకొనిపోవాలని ఈవోఆర్డీని కార్మికులు కోరారు. ప్రతినెలా సకాలంలో వేతనాలు అందకపోతే విధులు బహిష్కరించి ఆందోళనకు దిగాల్సి వస్తుందని వారు అధికారులతో పేర్కొన్నారు. తమకు నిబంధనల ప్రకారం అందించే చెప్పులు, కొబ్బరినూనె, దుస్తుల్లోనూ అన్యాయం చేస్తున్నారని కార్మికులు వాపోయారు. వీరు ఆందోళనకు దిగితే దాదాపు 24 వేల మంది ప్రజలకు స్వచ్ఛత దూరమవడం ఖాయం.



# అంతా.. ఆ నలుగురే...

**- బిసి వెల్ఫేర్‌లో వారే వారధులు, రథసారధులు**

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా బిసి వెల్ఫేర్ హాస్టల్స్‌లో జరుగుతున్న అక్రమ భాగోతంలో వారధులు రథసారథులు ఆ నలుగురు మాస్టార్లే కీలకమన్నది ఆ శాఖలో అందరినోట సర్వసాధారణంగా వినిపించే మాట. ఈ శాఖలో అక్రమార్జన సాగించే పలువురి నుండి నెలనెలా లక్షలాది రూపాయలు వసూళ్ళు చేసి అందాల్సిన వారికి వారి వారి వాటాలను గోప్యతగా చేరుస్తుంటారు ఆ నలుగురు. జిల్లాలో బిసి వెల్ఫేర్ హాస్టల్స్‌ను కదిరి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండలను నాలుగు డివిజన్‌లుగా విభజించారు. ఆయా డివిజన్ల పరిధిలో ఆ నలుగురి కనుసైగల్లోనే అక్రమ భాగోతం సాగుతుంటుందని ప్రతీతి. వారి డివిజన్లలో నెలవారి బిల్లు కాగానే టంఛన్‌గా వసూళ్ళు, వాటాల పంపకాలు ఆ నలుగురి ద్వారానే వివిధ స్థాయి అధికారులకు చేరుతున్నట్లు తెలుస్తున్నది. ఎప్పుడైనా ఆకస్మికంగా విభేధాలు తలెత్తితే వారు జోక్యం చేసుకొని సమస్య సర్దుబాటు, దిద్దుబాటు చేస్తుంటారు. పై అధికారులు తమ చేతులకు ఏమాత్రం మట్టి అంటకుండా అన్ని అక్రమ భాగోతాలను వీరిద్వారానే చేయిస్తుంటారన్న వాదనలు సర్వత్రా ఉన్నాయి. అక్రమార్జనలో జిల్లాలో ఆ నలుగురికే పెద్దపీట. వీరికి ఆయా డివిజన్‌ల పరిధిలో 200 నుండి 300 మంది పైగా విద్యార్థులు ఉండే విదంగా రెండు నుండి మూడు హాస్టళ్ళ బాధ్యతలను జిల్లా అధికారి అంటగట్టడంతో అక్రమార్జనలో వారిదే పెద్ద పీట అని బహిరంగ చర్చలు సాగుతున్నాయి. ధర్మవరం డివిజన్ పరిధిలో సీనియారిలో అతనే ఘనుడు పెద్దన్న పాత్ర పోషించే జిల్లా రింగ్ లీడర్‌గా రెండు హాస్టళ్ళలో పెత్తనం సాగిస్తుంటారు. కదిరి డివిజన్ పరిధిలో అధికంగా మూడు ముచ్చట్ల మొనగాడు అన్న రీతిలో ఆ వార్డెన్ జిల్లాలోనే అత్యధికంగా 300లకుపైగా విద్యార్థుల సంఖ్యతో హాస్టళ్ళ బాధ్యతలు చూసుకుంటూ ఈ డివిజన్‌లో కీరోల్ పోషిస్తుంటాడు. అక్రమార్జనలో ఈయనది పెద్దపీటే. హిందూపురం డివిజన్ పరిధిలో మూడు హాస్టళ్ళకు ఓ వార్డెన్ బాధ్యతలు చేపట్టి విధులు నిర్వర్తిస్తూ అక్రమార్జన సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఒక హాస్టల్ బాధ్యతల నుండి ఈయనను తప్పించినట్లు తెలుస్తున్నది. ఈ అక్రమ భాగోతంలో ఈయనది అందెవేసిన చేయ్యి. ఈ డివిజన్ పరిధిలో ఈయన ప్రముఖ పాత్ర పోషిస్తూ వారధిగా నిలుస్తుంటాడు. పెనుకొండ డివిజన్ పరిధిలోని మరో వార్డెన్‌కు 300లకుపైగా విద్యార్థులు ఉండే రెండు హాస్టళ్ళను అంటగట్టడంతో అక్రమార్జనలో ఈయనది కూడా ఘనమైన పాత్రే. ఈ బాషా ఖై చెప్పిందే చేస్తాడు...చేసిందే చెప్తాడు అన్న చందంగాక్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు ఎవరి వాటా వారికి చేరే విధంగా వారధిగా నిలుస్తుంటాడు. జిల్లాలోనే ఈ పెనుకొండ డివిజన్ నుండి అత్యధికంగా అక్రమార్జన రూపంలో అధికారులకు చేరుతోందంటే ఈ డివిజన్ పరిధిలోని హాస్టళ్ళ నిర్వహణ ఏపాటిదో అవగతమౌతుంది. ఈ శాఖలోని అన్ని స్థాయిలలో అక్రమాల భాగోతం నిరంతరం కొనసాగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించకపోవడం విచారకరం. ఇప్పటికైనా ఈ బిసి సంక్షేమ హాస్టళ్ళ అవినీతి బాగోతంను అరికట్టే విధంగా ఉన్నతాధికారులు లోతుగా విచారణ సాగించి పారదర్శకంగా హాస్టళ్ళ నిర్వహణ కొరకు ప్రత్యేకచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# హాస్టల్ విద్యార్థినులకు వాంతులు విరోచనాలు

**- ఫుడ్ పాయిజన్ తో 30 మంది విద్యార్థినులకు అస్వస్థత - హాస్టల్ వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత**



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత





బాత్రూంకు డోర్ లేని దృశ్యం, పాచిపట్టిన తాగునీటి వాటర్ ట్యాంక్

**కనగానపల్లి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్ నందు బుధవారం ఉదయం విద్యార్థినులు పొంగల్, చట్నీ తినడంతో ఫుడ్ పాయిజన్ కావడంతో వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి , ఒళ్ళు నొప్పులు జ్వరం నీరసంతో కావడంతో స్థానిక పీహెచ్సీ ఆసుపత్రి నందు 30 మంది విద్యార్థినులకు ఫ్లూయిడ్స్ ఎక్కించి ఇంజక్షన్లు, మాత్రలు అందించారు. ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. జిల్లా వైద్యాధికారి డా ఫైరోజా బేగం, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సెల్వియా సోలమన్, లతో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వారికి తెలిపారు. ముగ్గురు విద్యార్థునులకు కడుపునొప్పి ఎక్కువ కావడంతో అనంతపురం ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కుదుటపడడంతో వారిని డిశ్చార్జ్ చేసినట్లు వారు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీత మోడల్స్ స్కూల్ హాస్టల్లోని వంటగదిని అలాగే బాత్రూం పరిసరాలను పరిశీలించారు. అక్కడ అపరిశుభ్రత పై హాస్టల్ వార్డెన్ సరిత పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రత పాటించకుండా ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పదని ఆమెపై ఎమ్మెల్యే సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవికిరణ్ ను హాస్టల్ ను ప్రతిరోజు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ యాతం పోతులయ్య, ఎంపీడీవో అనిల్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు అరుణమ్మ, శ్రీదేవి లు, పీహెచ్ డాక్టర్లు చెన్నారెడ్డి ,భానురేఖ వైద్య సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి .రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్ డిమాండ్ మోడల్ స్కూల్ హాస్టల్ లోని 30 మంది విద్యార్థునులకు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థత కావడంతో ఆయన విద్యార్థులను పరామర్శించారు. అలాగే మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్ ను పరిశీలించారు. వంటగది అపరశుభ్రంగా ఉందని వాడిపోయిన కూరగాయలను అలాగే పాచి పట్టిన వాటర్ ట్యాంక్ ను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్ సరిత హాస్టల్ ను అపరిశుభ్రంగా ఉంచడం తో పాటు బాత్రూంలో డోర్ లు కూడా లేకుంటే ఆడపిల్లలు ఎలా స్నానం చేస్తారని వార్డెన్ పై ఆయన మండిపడ్డారు. ఇంత అధ్వాన్నంగా పాచిపట్టిన నీరు తోనే వంట చేయడం వాడిపోయిన కూరగాయలతో వంట చేయడంతోనే ఆహారం విషతుల్యం అయిందని అది తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని హాస్టల్ అపరిశుభ్రతపై ఎన్నోసార్లు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశామని అలాగే వార్డెన్ సరిత లోకల్ గా ఉన్నారని ఆమెకు రాజకీయ అండ ఉండడంతో మండల స్థాయి అధికారులు ఆమెకు చెప్పేందుకు సాహసం చేయలేదని విద్యార్థునులు అనారోగ్యానికి కారణమైన హాస్టల్ వార్డెన్ సరిత పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఇలాంటివి మళ్లీ పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వడ్ల గోవిందు ,పసల నాగరాజు, గవ్వల ప్రసాద్ పాల్గొన్నారు.

# అర్హత లేకున్నా అందలం..!

- దేవాదాయశాఖ సాధారణ ఇన్‌స్పెక్టర్‌కు సహాయ కమీషనర్‌గా బాధ్యతలు
- విమర్శలకు తావిస్తోన్న దేవాదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారుల తీరు
- జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన గవిమఠం ఇంచార్జ్ ఏసీ నియామకం
- దేవాదాయ చట్టం 30/87 విరుద్ధంగా గెజిటెడ్ హోదా కల్పించిన దైన్యం



ఉరవకొండలోని గవిమఠ సంస్థానం

**అనంతపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త బ్యూరో**

అర్హతలేని వారికి అందలం ఎక్కిస్తూ అర్హతున్న వారిని అణగదొక్కుతూ దేవాదాయ ధర్మాదాయశాఖ ఉత్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధి చెందిన, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో వందలు, వేల ఎకరాల భూములు, కోట్లాది రూపాయల ఆస్తులు, 770 వరకు శాఖా మఠాలు కల్గిన ఉరవకొండకే తలమానికమైన గవిమఠ సంస్థానానికి సహాయ కమీషనర్/మేనేజర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంలో ఉన్నతాధికారులు దేవాదాయశాఖకు చెందిన పదోన్నతులు, ఇంచార్జ్‌ల నియామకాన్ని సూచించే 30/87 చట్టానికి విరుద్ధంగా నచుడుకున్నట్లు ఆశాఖలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. నిబంధనలకు పాతరేస్తూ అనర్హులను అందలం ఎక్కించడానికి భారీగా ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వివరాల్లోకి వెళితే...

ఉరవకొండ గవిమఠ సంస్థానం సహాయ కమీషనర్/మేనేజర్‌గా గెజిటెడ్ హోదా, అర్హతలేని ఉరవకొండ డివిజినల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రాణికు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించగా ఆమె గత ఏడాది డిసెంబర్ 23న బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సహాయ కమీషనర్‌గా పనిచేసిన కె.చిట్టెమ్మ సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా సహాయ కమీషనర్‌గా నియమితులై బదిలీ కావడంతో నాటి నుండి అనంతపురం జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమీషనర్ కె.ఆదిశేషనాయుడు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే దేవాదాయశాఖ ఉన్నతాధికారులు నిబంధనలను పక్కనబెట్టి ఒక సాధారణ ఇన్‌స్పెక్టర్‌కు సహాయ కమీషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించగా ఈ వ్యవహారం దేవాదాయశాఖలో గడిచిన మూడు నెలలుగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో గ్రేడ్-1 ఈఓలుగా గెజిటెడ్ హోదా కల్గిన సీనియర్లు, అర్హత కల్గిన అధికారులు ఎందరో ఉన్నా వారిని కాదని ఒక సాధారణ ఇన్‌స్పెక్టర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ఎలా అప్పగిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్‌కు గెజిటెడ్ హోదాకు రావాలంటే మరో రెండు పదోన్నతులు పొందాల్సి ఉంటుందని అలాంటిది మూడు రాష్ట్రాల్లోనే ప్రసిద్ధి చెందిన గవిమఠ సంస్థానం బాధ్యతలను అర్హత, అనుభవంలేని వారికి ఎలా అప్పగిస్తారని విమర్శలు వెల్లువెత్తుతున్నారు. దేవాదాయశాఖ చట్టంలో పదోన్నతులు, ఇంచార్జుల నియామాకాన్ని 30/87 చట్టం సూచిస్తుందని అయితే దాన్ని తుంగలోతొక్కి ఉన్నతాధికారులు సాధారణ ఇన్‌స్పెక్టర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారంటే ఈ వ్యవహారంలో పెద్దఎత్తున ముడుపులు చేతులు మారి ఉంటాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై దేవాదాయశాఖ విజిలెన్స్‌చే సమగ్ర విచారణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

**జిల్లా సహాయ కమీషనర్ వివరణ :**

అర్హత లేనివారికి సహాయ కమీషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంపై దేవాదాయశాఖ జిల్లా సహాయ కమీషనర్ ఆదిశేషనాయుడును 'ప్రభాతవార్త' ఫోన్‌లో వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలను ఎవరైనా పాటించాల్సిందేకాదా అని అన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**



**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ సెక్టార్‌పై జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఏ.మలోల, ఆర్డీఒలు కేశవనాయుడు, వసంతబాబు, ఏబివిఎస్‌బి శ్రీనివాస్, తహశీల్దార్లు, డిప్యూటి తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్ఎడ్‌టిలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని గడువు ముగిసిన గ్రీవెన్స్ ఎలాంటి పెండింగ్ వుంచడానికి వీలు లేదన్నారు. ఏపి డాటర్ ల్యాండ్స్ దరఖాస్తులు, మ్యుటేషన్ దరఖాస్తులు, రీవోక్ సర్టిఫికెట్లు (మ్యారేజ్ సర్టిఫికెట్లు), ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, వెబ్ ల్యాండ్‌లో ఆధార్ సీడింగ్, తదితర సర్వీసులకు ఎలాంటి పెండింగ్ వుంచరాదని ఆయా సర్వీసులను గడువులోపు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి జిల్లాలో 4,810 అర్జీలు రాగా వాటిలో 3,997 అర్జీలను పరిష్కరించగా, మిగిలిన పెండింగ్ వున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సర్వీసులకు సంబంధించి వస్తున్న అన్ని రకాల గ్రీవెన్స్‌ను పరిష్కరించాలన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వం వుండరాదన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే జరిగిన గ్రామాలను ఆర్డీఒలు, తహశీల్దార్లు తనిఖీ చేయాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో విపరీతమైన తప్పులు వున్నాయని వాటిని సరి చేసేందుకు విఆర్ఒ, సర్వేయర్, తహశీల్దార్లు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై కూడా ప్రతి రోజు మానిటర్ చేయాలని, ఇందులో వచ్చిన సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఒ, తహశీల్దార్ కార్యాలయాలకు సంబంధించి ఇన్‌స్పెక్షన్ ప్రొఫార్మా తయారు చేయాలని, ప్రొఫార్మా ప్రకారం అన్ని ఫైల్స్ ఆయా కార్యాలయాల్లో ఖచ్చితంగా వుండాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# వికసిత్‌భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా కృషి చేయండి

**- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**శ్రీసత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త ప్రతినిధి:**

వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా.. జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్ నందు, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే సింధూర రెడ్డి లతో కలిసి జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో 20 సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో జిల్లలో జరిగిన పురోగతిపై సమీక్షించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ సమీక్షలో... వికసిత భారత్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 లక్ష్య సాధనలో చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా జిల్లాలో ప్రధానంగా చేపడుతున్న 10 అంశాలైన సమీక్షించడం జరిగింది. అంతేకాకుండాఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, అమృత్ పథకం, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం కుసుమ్ వ్యవసాయానికి విద్యుత్ అందించే పథకం, అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న యూరియా సబ్సిడీ అలాగే జాతీయ ఆహార భద్రత పథకం, యోజన తదితర అంశాలపై చైర్మన్ సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన పంటల సాగుకు జిల్లాలో అపారమైన వనరులు పుష్కలంగా ఉన్నాయని. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కోసం గత 5 సంవత్సరాల అస్తవ్యస్త విధానాలతో కాకుండా వనరుల సద్వినియోగం అయ్యే విధంగా స్పష్టమైన ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు సూచన ఇవ్వడం జరిగింది. 'గ్రామీణ సడక్ యోజన ' కింద గ్రామాలలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరగాల్సినటువంటి అవసరం ఉందని అధికారుల దృష్టికి తేవడం జరిగింది, 2019-20 నుండి ఇంకా దీర్ఘకాలంగా ముగిలిపోయిన పాత పనులు మిగిలి ఉంటే త్వరగా పూర్తి చేయాలని తెలపడం జరిగింది . ఇప్పటివరకు అనుసంధానం కానీ గ్రామీణ రహదారులకు సంబంధించి జిల్లాలో 2024 -25 సంబంధించిన 395.15 కిలోమీటర్ల పనులకు సంబందిచి 245.64 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనల పురోగతి పైన సమీక్ష జరిగింది. జిల్లాలో స్వయం సేవ గ్రూపులలోని మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలనే 'లక్ పతి దీదీ' లుగా 98,715 గుర్తించగా, నిర్దేశించిన లక్ష్యంని వేగంగా అందుకోవాలని ఆదేశించారు.మొత్తం 6 డ్రోన్లను పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలో స్వయం సహాయక గ్రూపులకు శిక్షణ ఇవ్వడం ద్వారా చిన్న, సన్నకారుల రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా డ్రోనుల వినియోగానికి అవకాశం కల్పించడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం డ్రోనుల పైన

మిగతా 3 లో...

# అందరి సహకారంతో జెఎన్‌టియుఏని అభివృద్ధి చేస్తాం

**జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు**



బాధ్యతలు స్వీకరిస్తున్న విసి సుదర్శన్‌రావు



విసి సుదర్శన్‌రావును సన్మానిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య

**అనంతపురం సిటి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**

అందరి సహకారంతో జెఎన్‌టియుఏని మరింత అభివృద్ధి పతంలోకి తీసుకెళ్తామని జెఎన్‌టియుఏ వైస్ ఛాన్స్‌లర్ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. జేఎన్‌టియుఏ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్స్‌లర్‌గా కొనసాగుతూ రెగ్యులర్ విసిగా నియమితులైన సుదర్శన్‌రావు బుధవారం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఎన్‌టియుఏ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రతి ఉద్యోగి సహకారాన్ని తీసుకుంటానని అందరి సహకారంతో జెఎన్‌టియుఏని ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణయ్య, విసి ఓఎస్‌డి దేవన్నలతోపాటు యూనివర్సిటీ డైరెక్టర్లు పలు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తోపాటు ఉన్నతాధికారులు, సిబ్బంది వైస్ ఛాన్స్‌లర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సన్మానించారు.

# బీసీ లోన్ల అభ్యర్థులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూ

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఏపిజీబి సోమలాపురం ఫీల్డ్ ఆఫీసర్

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బీసీ రుణాలకు నిబంధనల మేరకు బీసీ అభ్యర్థులు దరఖాసునత చేసుకోగా బ్యాంకర్లు, మండల ప్రజాపరిషత్ అధికారి ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం డి.హీరేహాళ్



మురడి యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ బీసీ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం.

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ దాస్‌నాయక్ ఆధ్వర్యంలో మూడు బ్యాంకులకు సంబంధించిన ఫీల్డ్ ఆఫీసర్లు, వారి సహాయకులు బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని సోమలాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో 163మంది బీసీ అభ్యర్థులు బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా 96మంది దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయని, మరో 67దరఖాస్తుల్లోన్ల వివరాలు సక్రమంగా పొందపరచ నందున రిమార్క్ కింద ఉంచడం జరిగిందని ఫీల్డ్ ఆఫీసర్ ఈశ్వర్ ఆదిత్య సాగర్ తెలిపారు. గొడిశెలపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో 64మంది బీసీ రుణాలకు దరఖాస్తులు చేయగా 37మంది దరఖాస్తుల వివరాలు సక్రమంగా పొందుపరచారని, మరో 27మంది వివరాలు సక్రమంగా లేవని బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ తెలిపారు. మురడి యూనియన్ బ్యాంకు పరిధిలో 118మంది బీసీ అభ్యర్థులు రుణాలకు దరఖాస్తు చేయగా 76మంది దరఖాస్తులు ఉన్నాయని, మరో 42మంది దరఖాస్తులు సక్రమంగా లేవని మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మూడు బ్యాంకుల పరిధిలో 330మంది బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా 209మంది దరఖాస్తుల వివరాలు సక్రమంగా లేనందున రిమార్కులో ఉంచారు. ఈ కార్యక్రమంలో పాలనాధికారి బలరాంరావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది, ఆయా బ్యాంకుల సహాయకులు రంగస్వామి, వన్నూరుస్వామి, బసవరాజ్, హనుమంతు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏపిలో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను వెంటనే చేపట్టాలి...

**లక్షల కుటుంబాలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్దికి దూరం...సీపీఎం జిల్లా కమిటి సభ్యులు బి.మల్లికార్జున.**

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



విలేఖర్లతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రాష్ట్రంలో వివాహం అనంతరం ప్రభుత్వ లబ్ది పొందే కుటుంబాలు లక్షలోన్ల ఉన్నాయని, వీటికి రేషన్ కార్డుల ప్రక్రీయలే నందున ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాలో లెక్కలేకుండా పోతున్నారని, కావున వెంటనే రేషన్ కార్డులు మంజూరు ప్రక్రీయను తక్షణమే చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి విలేఖర్ల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన వివాహ దంపతులకు రేషన్ కార్డు నమోదు గుదిబండగా మారుతుందని అన్నారు. నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జూలై, ఆగస్టు నెలలో మంజూరు చేస్తామని ప్రకటించినా ఇప్పటికి కొత్త రేషన్ కార్డులు మంజూరు పై ఎటువంటి పురోగతి లేదని, కొత్త కార్డులు చేర్పులు మార్పులకు వైసిపి హయంలోనే 3.36లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు అధికార యంత్రంగం నివేదికలు చెబుతున్నాయని, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అవకాశం కల్పిస్తే కొత్తగా కొన్ని లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికే తెలంగాణలో మూడవు దఫాలుగా కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఆంధ్రప్రదేశ్లో మాత్రం అటువంటి ప్రక్రీయ చేపట్టకపోవడంతో నూతన వివాహ దంపతులకు ఎదురుచూపుతు తప్పడం లేదని అన్నారు. గత ఐదేళ్ల నుండి కొత్త రేషన్ కార్డులు లేనందున ఆధార్ కార్డుల మాదిరిగానే పిల్లల చదువులకు, కులధృవీకరణ పత్రాలకు, ఆరోగ్యభీమాలకు, గృహ ప్రయోగకర వినియోగదారులకు, తదితర దరఖాస్తులకు సమస్యగా మారుతుందని తెలిపారు. కావున ఇప్పటికైనా కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రీయను వెంటనేకూటమి ప్రభుత్వం మొదలు పెట్టాలని, అలాగే కొత్తకార్డు దరఖాస్తుల ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమపథకాల జాబితా విడుదలచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటి సభ్యులు మధు, తిమ్మరాజు, రవి, రమేష్, మల్లికార్జున, రామాంజి, అజయ్‌కుమార్, ముని, ఆంజి, రైతు సంఘం జిల్లా కమిటి సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌విజిఎంలో సైబర్ నేరాలపై అవగాహన

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



మొబైల్ వాహనం ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ సూచనతో మొబైల్ వ్యాన్ ద్వారాకళాశాలలో వీడియోను 30నిమిషాల పాటు సైబర్ నేరాలు, మోసాలు ఏ విధంగా జరుగుతున్నాయి, వాటి నుంచి ఏవిధంగా జాగ్రత్తగా ఉండాలి అనే ఉదాహరణలతో సహా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవి శేషయ్య, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ కె.శ్రీధర్, కె.రవిశంకర్, అధ్యాపకులు శశికిరణ్, సుధాకర్, లక్ష్మీనారాయణ, గురుంమోహన్, రుక్మిణి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సైబర్ మోసాలు-నేరాలు వాటిపై జిల్లా ఎస్పీ ఒక లఘుచిత్రాన్ని జిల్లా ప్రజల కోసం మొబైల్ వాహనం ద్వారా విద్యాసంస్థలలో విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. సైబర్ సురక్ష-మన భద్రత మరియు మన బాధ్యత అనే నినాదంతో ప్రజలందరిని చైతన్య పరచాలనే ఉద్దేశంతో విద్యాసంస్థలలో విద్యార్థులకు అవగాహన కల్పించారని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ శ్రీధర్ తెలిపారు.

# ఈనెల 21న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ

బ్రహ్మసముద్రం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

వివిధ కార్పొరేషన్ల ద్వారా మండల వ్యాప్తంగా కార్పొరేషన్ రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 21 శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్ల ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఆన్లైన్ అప్లికేషన్ తో పాటు క్యాష్ టు ఇన్కమ్ ఆధార్ కార్డు రేషన్ కార్డు బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్ విద్యార్హత సర్టిఫికెట్ తీసుకువచ్చి ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీవో నందకిసర్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

# ముందుగానే ఒంటిపూట బడులు ప్రారంభించాలని డిమాండ్

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

తెలుగు రాష్ట్రల్లో మార్చి నెల రాక ముందే ఎండలు మండిపోతున్నాయని, ఉదయం 10గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని కావున ఒంటిపూట బడులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సాధారనంగా మార్చి మూడోవారం నుండి హాఫ్‌డే స్కూల్స్ ఉంటాయని, కానీ పరీక్షలు ముగిసే వరకు ఉదయం 7.45 నుండి మధ్యాహ్నం 12.30గంటల వరకు స్కూళ్లు పనిచేస్తాయని, వీటినింటినిమార్చి మా పిల్లలల ఆరోగ్యం కోసం ఒంటిపూట బడులను ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

# అంగన్వాడీ టీచర్లకు సర్టిఫికెట్ కోర్సు శిక్షణకార్యక్రమం

## బాల్య సంరక్షణ, విద్యపైఅవగాహన

బ్రహ్మ సముద్రం. ఫిబ్రవరి.19 ప్రభాతవార్త



శిక్షణా తరగతుల దృశ్యం

అంగన్వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సును పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 55,607 మంది అంగన్వాడీ టీచర్లకు ఈ శిక్షణ అందించనున్నారు. ఇందులో భాగంగా ప్రథమ్ సంస్థ ద్వారా ఆరు రోజుల ఆఫ్లైన్ శిక్షణను మంగళవారం నుంచి ప్రారంభించడం జరిగింది బ్రహ్మసముద్రంజిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో వారికి శిక్షణ ఇవ్వడం జరిగినది .ఈ కార్యక్రమానికి ఐ సి డి యస్.సూపర్ వైజర్ లు రామాంజీనమ్మ.ఖాసీంబి ఆధ్వర్యంలో డి ఆర్ పిలుగా అర్చన, రామాంజనేయులు,జగదీశ్ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో దాదాపుగా మండలం లో 51 మంది అంగన్ వాడి టీచర్స్ పాల్గొనడం జరిగినది.

# ప్రమాదవశాత్తు ఇద్దరు మృతి..

కణేకల్లు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:





ప్రమాదంలో మృతి చెందిన అనసూయమ్మ.

ఉరివేసుకొని మృతి చెందిన ఈశ్వర్

ఒకేరోజు ఇద్దరు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన బుధవారం కణేకల్లు మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒకరు ఉరివేసుకొని చనిపోయారు. మరొక్కరు ద్విచక్ర వాహనంపై కాలు జారిపడి క్రిందకు పడి తలకు దెబ్బలు తగిలి చనిపోయారు. కణేకల్లు మండల పరిధిలోని ఉడేగోళం గ్రామంలో ఈశ్వర అనే వ్యక్తి తాగుడుకు బానిసై బార్య కావేరిని ప్రతి రోజు కూలి పనులకు వెళ్లిన ఆ వచ్చిన డబ్బుతోనే తన ఇంట సంసారాన్ని నడిపేది, వీరికి కొడుకు కూడా ఉన్నాడు. ఈశ్వర పనికి వెళ్లకపోగా రోజు భార్యతో గొడవపడేవాడు. మంగళవారం రోజున భార్య కూలీ పని నుండి రాగానే తనకు తాగడానికి డబ్బులు కావాలని బార్యతో గొడవపడ్డాడు. భార్య నా దగ్గర డబ్బులు లేవు నేను ఇవ్వలేనని చెప్పడంతో మనస్థాపం చెందిన ఈశ్వర ఉరి వేసుకుని చనిపోయాడని పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా మంగళవారం రోజు అదే రాత్రి కణేకల్లు క్రాసింగ్ నందు ర్పమాదవశాత్తు ఒక మహిళ చనిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాకెట్ల గ్రామస్థులైన అనసూయమ్మ, సత్యనారాయణ ఇద్దరు మోటారు బైక్‌పైన కణేకల్లు క్రాస్ మీదుగా కదరంపల్లి ఊరికి వెళుతుండగా మార్గమధ్యంలో సత్యనారాయణ భర్తకు మూత్ర విసర్జన కోసం మోటర్ బైక్ని పక్కకు నిలబెట్టి మూత్రం విసర్జన చేసిన తర్వాత ఊరికి వెళ్లేందుకు సత్యనారాయణ బైకు మీద కూర్చుని తన భార్యను అనసూయమ్మను బైక్ మీద ఎక్కి కూర్చోమనగా అనసూయమ్మ మోటర్ బైక్ వైనుక సీటు మీద కూర్చుని పోయేటప్పుడు కాలుజారి పడిపోఆ తలకు దెబ్బలు తగలడంతో దగ్గరలోనే ఉన్న కణేకల్లు క్రాసింగ్‌లోని ఆర్డీటి ఆసుపత్రికి తరలించగా అక్కడ ఉన్న డాక్టరున్ల అనసూయమ్మ పరీక్షించి మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించాలని చెప్పగా భర్త ఆమెను బళ్లారి తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిని పోస్టుమార్టంకు తరలించినట్లుతెలిపారు.

# ఎస్ఎస్ మొబైల్ షోరూమ్ ప్రారంబించిన ధర్మతేజ.

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



ఎస్ఎస్ మొబైల్ షోరూమ్ ప్రాంబిస్తున్న ధర్మతేజ

కళ్యాణదుర్గం పట్టణంలో ముదిగల్లు రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ మొబైల్ షోరూమ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మేనల్లుడు, టిడిపి నాయకుడు దేవినేని ధర్మతేజ బుధవారం ప్రారంబించారు. షోరూమ్ నిర్వాహకులకు ఆహ్వానం మేరకు మొబైల్ షోరూమ్ ప్రారంబించి అందులో మొబైల్ ఆక్సిసరీస్ పరిశీలించి వాటి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తేజని షోరూమ్ యజమానులు సన్మానించారు.

# ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కి తాళాలు

**పట్టించుకోని జిల్లా అధికారులు.**

**బెల్టు షాపులు, నాటు సారాతో పల్లెలు విలవిల.**

కణేకల్లు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



తాళం వేసిన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పోలీసుల నిర్లక్ష్యం వలన మండల వ్యాప్తంగా పల్లెలో ఎటుచూసినా నాటు సారా, బెల్టు షాపులు విచ్చలవిడిగా పుట్టు గొడుగుల పుట్టుకు వస్తున్నా వీటిని అరికట్టాల్సిన అధికారులు నిద్రమత్తలో ఉన్నారని ఆ గ్రామ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కణేకల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కి బుధవారం మధ్యాహ్నం తాళాలు వేశారు. అటుపోతున్న వారు చూసి హవాక్కయ్యారు. ఇదే విషయాన్ని ఉమాబాయిని వివరణ అడగగా కణేకల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సిబ్బంది కొరత ఉందని, ముగ్గురు తోనే డ్యూటి చేస్తున్నామని పై అధికారులకు చెప్పినా పట్టించుకునే నాథుడే లేరని జిల్లా అధికారులకు చెప్పిన ఫలితం లేదన్నారు. సిబ్బంది తక్కువ ఉండడంతో స్టేషన్ను తాళాలు వేసి డ్యూటి చేయవలసి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కణేకల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కి తగినంత సిబ్బందిని ఇచ్చి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# అగళి మండలంలో క్రికెట్ టోర్నమెంట్

అగళి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఆగలి ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రీమియర్ లీ క్రికెట్ టోర్నమెంట్ 2 నిర్వహిస్తామని మడకశిర నియోజకవర్గం గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షులు కామరాజు తెలిపారు మార్చి 2 నుండి 7 8 మరియు 9 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మొదటి బహుమతి 30 వేల రూపాయలను మడకశిర నియోజకవర్గం గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షులు బహుకరించనున్నారు ద్వితీయ బహుమతి 15వేల రూపాయలను జడ్పిటిసి ఉమేష్ ఇవ్వనున్నారు తృతీయ బహుమతి మూర్తి ఎస్ సి ఎన్ వెల్డింగ్ వర్క్ వారు పదివేల రూపాయలను ఇవ్వనున్నారు టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులకు భోజనమసతిని ఏర్పాటు చేశారు.

# అసురులకు సింహ స్వప్నం

## ఘనంగా ఛత్రపతి జయంతి వేడుకలు



ఛత్రపతికి నివాళి దృశ్యం

హిందూపురం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు హిందూపురంలో శివాజీ సేవా ట్రస్ట్ అధ్యక్షులు, బిజెపి నాయకులు కే.వెంకటాచలపతి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన నివాసంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చత్రపతి జిందాబాద్.. జోహార్ చత్రపతి అంటూ నినాదాలు చేశారు. చలపతి మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ, సనాతన ధర్మం కోసం అహర్నిశలు పోరాడి ముష్కరులను దక్షిణాదివెపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడేలా చేశారని కొనియాడారు. అటువంటి మహనీయుడిని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగశంకర్, దేవంగం శంకరప్ప, రిటైర్డ్ ఎమ్మార్వో శివన్న, ఆర్టీసీ పిఆర్‌ఓ జగదీష్, సికల్చరల్ నందకుమార్, హెల్త్ డిపార్ట్మెంట్ ముని రంగన్న, వెంకటేశులు, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు మాధవ్, శ్రీరామ్ మడకశిర శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

# గడ్డివామి దగ్ధం - రూ. 50 వేలు నష్టం

చిలమత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



గడ్డివాము దగ్ధమవుతున్న దృశ్యం

మండలంలోని కోడూరు పంచాయతీలోని మదిరేపల్లిలో గుర్తుతెలియని ఆకతాయిలు బుధవారం గడ్డివామికి నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ తన పొలంలో సాగుచేసిన ఉలవ పంటను కోసి మూడు ట్రాక్టర్ల ఉలవగడ్డిని ఇంటి వద్ద కుప్పగా వేసి నూర్పిడి చేద్దామనుకున్నాడు. ఇంతలోనే ఆకతాయిలు నిప్పుపెట్టడంతో ఉలవ గడ్డి బూడిదైంది. దీంతో దాదాపు 50 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని రైతు సోమశేఖర్ కోరుతున్నారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**-ఎస్ఎఫ్ఐ నాయకులు**

లేపాక్షి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షి ప్రభుత్వ బిసి వసతి గృహాన్ని మంగళవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని పెండింగ్ లేకుండా మెస్, కాస్మోటిక్స్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం చేయకపోతే రాబోవు రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ లేపాక్షి మండల కార్యదర్శి నందీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అశ్వత్థనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# మాల కార్పోరేషన్ చైర్మన్‌ను కలిసిన గోరంట్ల జనసేన నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



శుభాకాంక్షలు తెలియచేస్తున్న నాయకులు

అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆంధ్రప్రదేశ్ మాల కార్పోరేషన్ చైర్మన్ పెద్దాపూడి విజయ్‌కుమార్‌ను గోరంట్ల మండల జనసేన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేష్, సిద్ధు, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్, నియోజకవర్గం నాయకుడు అనిల్‌కుమార్, మండల నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉమా నగర్ లో వంటగ్యాస్ సిలిండర్ల చోరీ

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం పట్టణంలోని ఉమానగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత ఫిరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ బాల బాలకృష్ణ ఇంటిలో రెండు గ్యాస్ సిలిండర్లు చోరీకి గురైనట్లు బాధితులు బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు ఇంటిలో ఒక్కరే ఉంటూ పొలం పనుల కోసం వెళ్లి వచ్చే వారిని, ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పొలం పనులు చూసుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చి గ్యాస్ స్టవ్ వెలిగించే ప్రయత్నం చేయగా వెలగకపోవడంతో బయట కాంపౌండ్ లో ప్రత్యేకగా ఏర్పాటు చేసిన సిలిండర్ల గదిని పరిశీలించామన్నారు అయితే స్టేర్ కేసు కింద ఉన్న గ్యాస్ గది ఇనుప కడ్డీల వాకలిని పగులగొట్టి ఒక ఖాళీ సిలిండర్ , వాడుకలో ఉన్న మరో సిలిండర్ను తీసుకు వెళ్లినట్లు పేర్కొంటున్నారు. దొంగల ఆచూకీ పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

కనగానపల్లి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



ఎంపీడీవో అనిల్ కుమార్

మండలం కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయం నందు నేడు గురువారం ఉదయం 11 గంటలకు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకు అధికారుల తో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అనిల్ కుమార్ తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2024 25 ఆర్థిక సంవత్సరానికి బీసీ,ఈబీసీ, కమ్మ, రెడ్డి ,క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, బలిజ కాపు కులాల వారికి సబ్సిడీ స్వయం ఉపాధి కింద సబ్సిడీ రుణాలు ప్రభుత్వం అందజేస్తుందని దరఖాస్తు చేసుకున్న వారు అప్లై చేసిన పత్రంతోపాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులము, ఆదాయము, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు మిగతా పత్రం లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీవో అనిల్ కుమార్ తెలిపారు.

# ఏ.ఆర్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

**-పోలీస్ దర్బార్‌లో జిల్లా ఎస్పి వి.రత్న**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పి వి.రత్న

పుట్టపర్తి (కల్చరల్), ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

ఎఆర్‌సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా ఎస్పి వి.రత్న పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏ.ఆర్ సిబ్బందికి పోలీస్ దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ ఏ.ఆర్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. నిరంతరం విధుల్లో



హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

ఉండే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించవచ్చున్నారు. ఏఆర్ పోలీసుల సర్వీసులకు సంబంధించి బకాయిలు బదిలీలు డిప్యూటేషన్లు సమస్యలను ఎస్పీ దృష్టికి సిబ్బంది తీసుకెళ్లగా, మీ సమస్యలన్నీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొందర్లోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల్లో పోలీస్ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పి శ్రీనివాసులు, ఏవో సుజాత, ఆర్ఐ వలి, ఆర్ ఎస్ ఐ లు , ఏ ఆర్ సిబ్బంది డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరిటాలశ్రీరామ్



గుంటూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరిటాలశ్రీరామ్.

ధర్మవరం, ఫిబ్రవరి19, ప్రభాతవార్త

రాష్ట్రాన్ని అబివృద్ధివైపు నడిపిస్తున్న కూటమి ప్రభుత్వానికి మేధావుల సహకారం కావ్యాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం గుంటూరుకృష్ణాజిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయన గుంటూరు ప్రాంతంలో విస్తృ తంగా ప్రచారాన్ని చేపట్టారు. ఎన్డీఏ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆల పాటి రాజేంద్రప్రసాద్ తరపున గుంటూరు నగరంలోని పలు ప్రభుత్వకార్యాలయాలు, విద్యాసంస్థల్లోలో పరిటాల శ్రీరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల పాటిరాజేంద్రప్రసాద్, స్థానిక ఎమ్మెల్యేలు నజీర్ అహమ్మద్, గళ్లమాధవి తదితర నాయకులతోకలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం తెనాలిలో ఎమ్మెల్సీ అభ్యర్థితోపాటు మంత్రినాదెండ్లమనోహర్తో కలిసి ప్రైవేటు పంక్షన్హాల్లో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, పట్టభద్రులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేయాలని పరిటాలశ్రీరామ్ ఆభ్యర్థించారు. రాష్ట్రాన్ని అబివృద్ధిపథంలో నడిపించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషిచేస్తోందని, కావున మంచినాయకుడికి మద్దతు ఇవ్వాలన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలోఉద్యోగుల వేతనాలు, వారికి అందించాల్సిన బెనిఫిట్స్ సరిగా అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి వచ్చేకే ఉద్యోగులకు 1వతేదీనే జీతాలు అందుతున్నాయన్నారు

# కంటి వెలుగు ద్వారా స్కూలు పిల్లలకి కంటి అద్దాలు ఉచిత పంపిణి

తాడిమర్రి ఫిబ్రవరి 19(ప్రభాతవార్త)



విద్యార్థులకు కళ్ళ అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ హరిత

గత ప్రభుత్వంలో కంటి వెలుగు ద్వారా స్కూలు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వ హించారు. అందులో భాగంగా కేజీబీవీ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మొత్తం 35 మంది విద్యార్థిని విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా మొత్తం 60 మంది విద్యార్థని విద్యార్థులకు కళ్ళద్దాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత మాట్లాడుతూ ఇంతకుముందు పిల్లలు చదువుకోవడానికి రాయడానికి కూడా సరిగా కనిపించక చాలా ఇబ్బంది పడే వారిని ఇప్పుడు విద్యార్థులకు కళ్లద్దాలు వలన చాలా ఉపయోగపడతాయని డాక్టర్ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎంఓఓ సికిందర్ ఎంపీహెచ్ఏ జానకిరామ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నసనకోట ఎంజేపి గురుకుల పాఠశాల అప్ గ్రేడ్‌పై విద్యార్థినుల ఆనందం

**- ఎమ్మెల్యే పరిటాల సునీతకు మేం రుణపడి ఉంటాం**

రామగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

థ్యాంక్యూ సునీత మేడం అంటూ రామగిరి మండలం నసనకోట ఎంజెపి గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపారు. నసనకోట ఎంజెపి పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాఠశాలలో విద్యార్థినులు, సిబ్బందిని కలసి ఆనందాన్ని పంచుకున్నారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఎంజెపి పాఠశాల రావడానికి, ఆ తర్వాత ఇదే పాఠశాలను జూనియర్ కళాశాల వరకు అప్ గ్రేడ్ చేయడానికి ఎమ్మెల్యే సునీత ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. రామగిరి ప్రాంతంలో గతంలో చాలా మంది బాలికలు చదువుకునే వారు కాదని, అందుకే ఇక్కడ ఎంజెపి పాఠశాల వచ్చేలా చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి జూనియర్ కళాశాలకు అప్‌గ్రేడ్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి సహకారాన్ని ఎప్పటికప్పుడు మరువలేమన్నారు.

# ఎస్సీల ఆర్థికాభివృద్దే ప్రధాన ధ్యేయం

## - గతం కన్నా మిన్నగా మెరుగైన అవకాశాలు కల్పిస్తాం - ఏపి మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ డా.పి.విజయ్‌కుమార్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ఎస్సీల ఆర్థికాభివృద్దే ప్రధాన ధ్యేయంగా పనిచేయనున్నామని ఏపి మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ డ్యాక్టర్ పి.విజయకుమార్ తెలి పారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక దామోదరం సంజీవయ్య భవనంలోని ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చాంబర్‌లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ డా.పి.విజయ్‌కుమార్ మాట్లా డుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్సీ కార్పోరేషన్ బలోపేతం చేసేం దుకు చర్యలు చేపట్టామన్నారు. ఎస్సీలకు చెందిన మాల, మాదిగల ఆర్థికా భివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతం కన్నా మిన్నగా వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తామన్నారు. వారి ఆర్థికాభివృద్దే ధ్యేయంగా తాము పని చేస్తామన్నరు. అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్సీలకు సంబంధించిన అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేస్తున్నా మన్నారు. కార్పోరేషన్ కార్యాలయాల్లో ఎస్సీలకు అందిస్తున్న పథకాలు, సేవలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపొందించిన విజన్ డాక్యుమెంట్, 2047లో భాగంగా ఎస్సీ కుటుంబాల నుంచి పారిశ్రామిక వేత్తలు తయారు చేస్తామన్నా రు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వారికి ఆసక్తి ఉన్న రంగంలో వారిని తీర్చిదిద్ది పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు తగిన ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. గత పాలకులు ఐదేళ్లపాటు సబ్ ప్లాన్ నిధు లను ఇష్టాను సారంగా ఇతర పథకాలకు మళ్లించారని, ఎస్సీలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేశారని ఆయన విమర్శించారు.



మాట్లాడుతున్న చైర్మన్ డా.పి.విజయ్‌కుమార్

అలాగే విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించి.. రెగ్యులర్ ఈడిని త్వరలోనే నియమిస్తామని, కాంప్లెక్స్‌లో అర్హులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటామని, అతి త్వం లోనే ఎస్సీ కార్పోరేషన్ ద్వారా సబ్సిడి రుణాలకు దరఖా స్తులు చేసుకోవడానికి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తా మన్నారు. ఈ సందర్భంగా ఏపి మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనా న్స్ కార్పోరేషన్ డైరెక్టర్ కె.కమ లమ్మ మాట్లాడుతూ.. అనంత పురం జిల్లాకు విచ్చేసిన చైర్మన్ దృష్టికి జిల్లా సమస్యలను తీసుకువచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి ఇంటికీ ఒక వ్యాపార వేత్తను తయారు చేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తో ఒదన్నారు. ఎస్సీ కార్పోరేషన్ ఈడి రాధిక మాట్లాడుతూ.. ఎస్సీలకు అంది స్తున్న పథకాలపై చైర్మన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహి ంచారన్నారు. వారి సూచనల మేరకు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. మొదట జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వ కంగా కలిసి మొక్కను అందజేశారు. అలాగే సిపిఓ ఆఫీస్ హాల్‌లో మాల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి అర్జీలను స్వీకరించారు. అలాగే ఎస్సీ కార్పోరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే ఎస్సీ కార్పోరేషన్ పరిధిలోని కాంప్లెక్స్, టివి టవర్ వద్ద ఉన్న ఇండస్ట్రీయల్‌ను పరిశీలించారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠ శాలలో ఖాళీగా ఉన్న పో స్టుల భర్తీకి డిఎస్సీ నోటిఫికే షన్ విడుదల చేయాలని జిల్లా పరిపాలన అధికారికి ఎఐవై ఎఫ్ ఏపి ఆర్గనైజింగ్ కార్యదర్శి సం తోష్‌కుమార్ బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా సంతో ష్‌కుమార్ మాట్లా డుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభు త్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని తొ లి సంతకం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు కోట్రేష్ అనంతపురం జిల్లా ఉప అధ్యక్షులు కార్యదర్శిలు దేవేంద్ర, ధనుంజయ్, రాష్ట్ర సమితి సభ్యులు మురళీ, ఏఐవైఎఫ్ అనంతపురం నగర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇస్తాం



పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీలో గ్రామ స్థాయి నుంచి కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఇస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మన టిడిపి యాప్‌లో చురుకుగా పాల్గొని ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరుస్తున్న టిడిపి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభినందన పత్రాల తోపాటు పార్టీ ఎంబ్లమ్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఇంకా గట్టిగా కృషి చేసి స్థానిక ఎన్నికల్లో గెలుపుబాట దిశగా, అలాగే 2029లో జరిగే సాధారణ ఎన్నికల్లో గెలుపునకు అందరం సమన్వయం చేసుకుని ముందుకు పోదామన్నారు.

## విద్యార్థి మరణానికి కారణమైన ఎస్ఆర్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

అనంతపురం నగర శివారు ప్రాంతంలో మంగళవారం ఎస్సార్ జూనియర్ కళాశాల బాయ్స్ క్యాంపస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీకాంత్ అనే విద్యార్థి హాస్టల్‌లో నుంచి బయటకు వెళ్లి పక్కనే ఉన్న తోటలో చెట్టుకు ఉరివేసుకుని మరణించడం జరిగింది. ఈ మృతిపైన సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బి, బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో ఆర్ ఐఓ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, పృథ్వి, సురేష్ యాదవ్, హనుమంత రాయుడులు మాట్లాడుతూ..జిల్లాలో కార్పోరేట్ విద్యా సంస్థలలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నప్పటికీ జిల్లా ఆర్ఐఓ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవ డం లేదన్నారు. కావున వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఎఐసి ఎస్కేయూతో ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఒప్పందం కొనసాగింపు





ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

స్థానిక ఎస్వి డిగ్రీ, పిజి కళాశాల అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఎఐసి) ఎస్కేయూతో ఒప్పందాన్ని కొనసాగిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగభూషణ రాజు తెలిపారు. బుధవారం ఎఐసితో కొనసాగింపు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి కళాశాల యాజమాన్యంతో ఇరువురు మార్చుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్ఎవి.ప్రసాద్, ఎఐసి మేనేజర్ సి.చంద్రమౌళి, ఎఐసి అసోషియేషన్ పి.జ్యోతి, కళ్యాశాల ఎఐసి కన్వీనర్ డా.రిజ్వానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక రంగంలో స్వయం ఉపాధికి ఇస్తున్న ఉచిత శిక్షణ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) నిర్వహణలో పారిశ్రామిక రంగంలో స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఎఫ్ఏసి డి.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు అనగా(ముస్లింలు, దూదేకుల ముస్లిం, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్దులు, పారశీకులు, జైనులు) దరఖాస్తు ఫారం (బయోడేటా)తోపాటు విద్యా అర్హతల సర్టిఫికెట్స్ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు కార్యాలయానికి పంపాలని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ కార్యనిర్వహణాధికారి (ఎఫ్ఏసి) డి.సుబ్రహ్మణ్యం కోరారు. ఉచిత శిక్షణ కొరకు ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులకు దరఖాస్తు ఫారంను కార్యాలయ చిరునామా కార్యనిర్వహణ అధికారి, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పోరేషన్, కలెక్టరేట్ కాంపౌండ్, అనంతపురంకు పంపాలని, ఇతర సమాచారం కొరకు 9849901138లో సంప్రదించాలని కోరారు.

## నేటి నుంచి పేదరిక నిర్మూలనకు పి-ఫోర్ సర్వే - ఎంపిడిఓ భాస్కర్



మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పి-ఫోర్) సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన పంచాయితీ కార్యదర్శిలు, డిజిటల్ అసిస్టెం ట్లు, సోషియల్ వెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని పంచాయితీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది అందరూ పి-4 సర్వేలో పాల్గొనాలని ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న, 10 శాతం మంది అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది ప్రజలకు సాధికారత కల్పించడంలో భాగంగా అణగారిన వర్గాలను ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించడానికి ఈ నెల 20 నుంచి 28వ రకు సర్వే నిర్వహించనున్నట్లు, ఇది 100 శాతం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సర్వే పూర్తి అయ్యేంత వరకు ఎవరికి ఎటువంటి సెలవులు మంజూరు చేయడం కుదరదన్నారు.

## ఘనంగా చత్రపది శివాజీ జయంతి వేడుకలు





ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యాలు

కూడేరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని కూడేరులో బుధవారం హిందూ ఏక్తా జైక్‌ర్యాలీ, శోభాయాత్ర విజయవంతంగా కొనసాగింది. స్థానిక ఆర్టిసి బస్టాండ్ నుంచి అనంత వెంకటరెడ్డి కాలనీ వరకు భారీ బైక్ ర్యాలీ, శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు డిప్యూటీ తహశీల్దార్ సూర్య ప్రతాప్ యాదవ్ పాల్గొని ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం రాజ పరిపాలనలో హిందువుల పట్ల నిరంకుశంగా మత మార్పిడి కొనసాగుతున్న సందర్భంగా హిందూ సామ్రాజ్య విస్తరణపై ఛత్రపతి శివాజీ చూపిన చొరవతో నేటి దేశం హిందూ దేశంగా కొనసాగుతుందన్నారు. తన తల్లి జీజీయ బాయి స్ఫూర్తితో మిందువుల ఐక్యత, విస్తరణ కోసం భీకరమైన యుద్ధాలు చేసి ముస్లింల రాజుల నుంచి హిందువులను కాపాడి ఘనత శివాజీదే అన్నారు.

## తల్లి బిడ్డల నమోదు విషయంలో నిర్లక్ష్య ధోరణి విడనాడాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న స్టేట్ ఏడి డాక్టర్ అనిల్ కుమార్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డా. అనిల్ కుమార్ అనంతపురం ఓల్డ్ టౌన్ ఫిబ్రవరి 19 ప్రభాతవా ర్తతల్లి బిడ్డల వైద్య సేవల వివరాలు గర్భిణీ వివరాల నమోదు విషయంలో నిర్లక్ష్య ధోరణి విడనాడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ఈ.బి. దేవి తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో ఆయన మాట్లాడుతూ హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ప్రకారం గర్భిణీ మహిళలకు, తల్లి బిడ్డల వివరాలు నమోదు చేయాలని అలాగే జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో వారికి అందిస్తున్న సేవలు గురించి తెలియజేసి వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా యుగంధర్ , డా అనుపమ , డా రవిశంకర్ ,యస్ ఓ మహ్మద్ రఫీ , కిషోర్ , ఇతర సిబ్బంది పాల్గొన్నారు .

## కురుకుంట గ్రామంలో ఏర్పాటు చేసి ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి..

### కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ I పంచాయితీ కార్యదర్శి యు.హిదయతుల్లా

అనంతపురం రూరల్,ఫిబ్రవరి19ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం కురుకుంట పంచాయితీలోని సచివాలయం లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెండు రోజుపాటు ఈ నెల 20,21వ తేదిలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్ర సౌకర్యాలను గ్రామ ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్1 పంచాయితీ కార్యదర్శి యు.హిదయతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుకుంట పంచాయితీలో నివాసించే ప్రజలు నూతన ఆధార్ కార్డు నమోదుతో పాటు పేర్లు,చేర్పులు,మార్పుల కోసం గురువారం ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఈ అవకాశంను వినియోగించుకుని అధిక మంది తల్లులు వారి చిన్న పిల్లలకు నూతన ఆధార్ కార్డు తీయించుకోవడం జరగడంతో పాటు అనేక మంది వారి అడ్రస్,పేర్లలో చేర్పులు,మార్పులు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఆధార్ సెంటర్ ఏర్పాటు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడిందన్నారు.

# రైతుల నుండి కొనుగోలు చేసిన కందులకు నగదును తక్షణమే రైతు ఖాతాలో జమ చేయండి

## జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ కు వినతి పత్రం అందజేసిన జిల్లా రైతు సంఘం ప్రధానకార్యదర్శి సి. మల్లికార్జున

అనంతపురం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

రైతుల నుండి కొనుగోలు చేసిన కందులకు నగదును తక్షణమే రైతు ఖాతాలో జమ చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ కు వినతి పత్రం అందజేసిన జిల్లా రైతు సంఘం ప్రధానకార్యదర్శి సి.మల్లికార్జున అంద జేశారు. ఈ సందర్భంగా శ్రీ మల్లికార్జున మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లాసమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం నందు రైతులు కొనుగోలుకు కేంద్రాల్లో అమ్మిన కందులకు నగదును రైతుల ఖాతాలో జమ చేయాలని జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్‌కు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి చిన్నప్ప యాదవ్ ,జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పి రామ కృష్ణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. జిల్లాలో కంది పంటను మంచి దిగుబడి ఆశించి రైతులు సాగు చేస్తే కనీసం 6,7 రావాల్సిన దిగుబడి కేవలం ఒకటి,రెండు క్వింటాళ్ల రావడం జరిగిందని, అందువలన రైతులు పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలై గిట్టు బాటు ధర లేక నష్టపోవడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం రూ.7,550 కంది పంటకు మద్దతు ధర ప్రకటిస్తే ఏ మూలకు సరిపోవడం లేదు అందుకే రూ 2,450 బోనస్ ప్రకటించి రైతులకు క్వింటాకు రూ.10 వేలు ప్రకారం అందించాలన్నారు. అప్పుడే రైతులకి న్యాయం జరిగేది జిల్లాలో దాదాపుగా 50,వేలు హెక్టార్లలలో కంది పంట సాగు చేసిన చీడపీడలతో వర్షాభావంతో పూత పింద రాలిపోయి రైతులు పెట్టి న పెట్టుబడి కూడా రాక ఇబ్బంది పడుతున్నారు అన్నారు. అందుకోసం మార్కెపెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందులకు తక్షణమే రైతుల ఖా తాలోనగధు జమ చేయాలి అని కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా అక్కడ ఉండే జిల్లా అధికారులకు మార్క్‌ఫెడ్ అధికారులు కలెక్టర్ కార్యాలయం దగ్గరికి వారిని రమ్మని అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. వారితో మాట్లాడి రైతులకు నగదును జమ చేసే విధంగా ఆదేశిస్తామని జిల్లా రైతు సంఘం కమిటీకి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు మధు యాదవ్, శ్రీకాంత్ ,ఏఐవైఫ్ జిల్లానాయకులు,ధను, అశోక్, శ్రీరాములు పాల్గొన్నారు.



కలెక్టరుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

# ఉపాధి హామీ పథకంపై కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

పిఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్ బుధవారం సాయంత్రం డ్వామా పిడి, ఏపిడి, అదనపు ప్రోగ్రాం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో ఉపాధి హామీ పైన సమీక్ష సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోజు వారి కూలీల సంఖ్య పెంపు, కనీస వేతనము, ఫారం ఫండ్స్ నిర్మాణాలు, 100 రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య పెంపు, కరువు మండలాలలో అదనపు 50 రోజుల పని దినాలు, ఇండివిడ్యుల్ సోక్ పిట్స్ నిర్మాణాలు వంటి పలు అంశాలపై సమీక్షించడమైంది. ప్రతిరోజు జిల్లాలో 1.00 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవలసిందిగా అన్ని మండలాల సహాయ పథక సంచాలకులు, అదనపు ప్రోగ్రాం అధికారులను ఆదేశించడమైంది. ప్రతి గ్రామములో ఉపాధి కూలీలు వలసలు వెళ్లకుండా స్థానిక గ్రామాలలో ఉపాధి పనులు కల్పించవలసిందిగా అదనపు ప్రోగ్రాం అధికారులను ఆదేశించడమైంది. 100 రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య 48,220 టార్గెట్‌గా ఇవ్వడమైంది. జిల్లాలో 13,553 కుటుంబాలు మాత్రమే 100 రోజులు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన 34,667 కుటుంబాలు మార్చి 31లోపు 100 రోజులు పూర్తి చేయవల సిందిగా సహాయ పథక సంచాలకులు, అదనపు ప్రోగ్రాం అధికారులను ఆదేశించడమైంది. ఫ్యూరం ఫండ్స్ నిర్మాణాలు ప్రతి గ్రామ పంచాయితీకి 10 చొప్పున 5780 నిర్మాణాలను మార్చి 31లోపు పూర్తి చేయవలసిందిగా సహాయ పథక సంచాలకులు, ఆదనపు ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. ఫ్యూరం ఫండ్స్ నిరిర్మంచుకున్న రైతులకు 10 రకాల పండ్ల మొక్కలు, కాయగూరల కిట్లు మంజూరు చేయబడునని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా, ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించి పెద్ద సంఖ్యలో ఫారం ఫండ్స్ నిర్మాణాలను పూర్తి చేయవల సిందిగా అదనపు ప్రోగ్రాం అధికారులను ఆదేశించ డమైంది. జనవరి నుంచి జూన్ చివరి నాటికి ప్రతి గ్రామ పంచాయితీకి 25 చొప్పున ఫారం ఫాండ్స్ నిర్మా ణాలు పూర్తి చేయవలసి ందిగా పథక సంచాలకులు, సహాయ పథక సంచాలకులు, అదనపు ప్రోగ్రా ం అధికారులను ఆదేశించడమైం ది. ఎస్ఎస్ఎస్ సంఘాలకు రూ.300 వేతనము అందలా గ్రూప్ మార్కింగ్ ఇచ్చి, కనీసం 5 గంటలు పని చేసేలా కూలీలకు అవగా హన కల్పించి కనీసం వేతనము రూ.300 పొందేలా తగు చర్యలు తీసుకోవలసిందిగా ఉపాధి సిబ్బందిని కమిషనర్ ఆదేశించడమైంది. జనవరి నుంచి జూన్ వరకు ఉపాధి వర్స్ సీజన్ కావున ప్రతి బుధవారం కమిషనర్ వారి సమీక్ష సమావేశము నిర్వహించబడునని, ఉపాధి సిబ్బంది అన్ని అంశాలలో మండలాల లక్ష్యం మేరకు ప్రగతి సాధించాలని కమీషనర్ ఆదేశించడమైంది. ఈ కార్యక్రమంలో పిడి సలీం భాష, ఏపిడిలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విసికి హాజరైన పిడి సలీం బాషా, ఏపిడిలు, ఇతర అధికారులు

# పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కలిసిన అనంతపురం జిల్లా వాల్మీకి బోయ సంఘం నేతలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలని కోరుతూ అనంతపురం జిల్లా వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కలసి ఉమ్మడి అనంతపురం జిల్లాలో, రాష్ట్రంలో వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ పునరుద్దరణ అంశం మీద అసెంబ్లీలో తమ గళం వినిపించాల్సిందిగా పుట్టపర్తి ఎమ్మెల్యేని కోరడం జరిగింది. ఈ సందర్భంగా పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో కచ్చితంగా వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తమ గళం వినిపిస్తామని అంతేకాకుండా దశాబ్దాల తరబడి ఉన్న ఈ సమస్య గూర్చి మరొక్కసారి సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం అనంతపు రం జిల్లా అధ్యక్షులు మాధవయ్య, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మణి రవి, యూత్ వింగ్ జిల్లా వర్కిం గ్‌ప్రెసిడెంట్ క్రాంతి కుమార్, జిల్లా సెక్రెట రీ దాసరి చలపతి, నగర అధ్యక్షుడు కుళ్లాయప్ప, నగర వర్కింగ్ ప్రెసిడెం ట్ శంకర్, నగర ప్రధాన కార్యదర్శి ముత్యాలు, ఏపివి బిఎస్ నాయకులు కేశవ, వాల్మీకి నాయకులు బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అనంతపురం వాల్మీకి నేతలు

# వ్యవసాయ మెలుకువలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలి

## - ప్రతి రైతకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి - జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ - నీలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం తనిఖీ





పొలం పిలుస్తోంది కార్యమ్రానికి తనిఖీ చేస్తున్న ఉమామహేశ్వరమ్మ.



రైతులకు గుర్తింపు సంఖ్య గురించి తెలియజేస్తున్న దృశ్యం.

పామిడి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

రైతులు వ్యవసాయ మెలుకువలు పాటిస్తూ సాగు చేసిన పంటల్లో అధిక దిగుబడులను సాధించాల్సిన అవసరం ఎంతైనా వుందని జిల్లా వ్యవసాయ అధికా రిణి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మండల పరిదిలోని నీలూరు గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అందికారిణి లీనా వసుంధర ఆధ్వర్యంలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చటమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులందరూ గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వటం ద్వార వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావటం జరుగుతుందన్నారు. పిఎం కిసాన్, ఇన్పూట్ సబ్సీడీ, ఇన్సూరెన్స్, సబ్సీడీ విత్తనాలు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్తపతుల అమ్మకాలు ఇతరత్ర వాటికి రైతులకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని తెలియజేశారు.

పట్టాదారు పాసుపుస్తకం ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసందానమైన మొబైల్ నెంబర్‌తో రైతులు రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయిం చుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుంటూ ఆధునిక పద్దతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా అవగాహన పెంపొందించటమే పొలం పిలుస్తోంది ముఖ్యఉద్దేశ్యం అంటూ ప్రత్యేక గుర్తిం పు సంఖ్య, కందుల కొనుగోలు కేంద్రాలపై వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, ఎంపిఈఓ రామాంజనేయులు, గ్రామ వ్యవసాయ సహాయకులు చందన, అరుణ, రైతులు నారాయణరెడ్డి, రమణారెడ్డి, దేవేం ద్రరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాఘవ, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్‌భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా కృషి చేయండి

( మొదటి పేజీ తరువాయి ) సబ్సిడీ ఇస్తుంది.పీఎంఏవై అర్బన్ క్రింద జిల్లాలో కేటాయించిన 66,393 గృహాలకు, పూర్తి అయినవి 24,501 మాత్రమే. అలాగే పీఎంఏవై గ్రామిణ్ 5,576 లో గ్రౌండ్ అయినవి 611 మాత్రమే. అయితే నివాసయోగ్యమైన మౌలిక సదుపాయాల కల్పన లేక లబ్దిదారులు ఇబ్బంది పడుతున్నారు, మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే చర్యలను తీసుకోవాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. జిల్లాలో పట్టణాలలో ప్రతి ఇంటికి సురక్షిత త్రాగు నీటి సరఫరా కోసం, ఎస్టీపీ కోసం, వాటర్ పంపింగ్ కోసం మరియు సీవరేజ్ లైన్ కోసం అమృత్ 1.0 క్రింద 2017లో హిందూపూర్ కు కేటాయించిన నీటి సప్లై అభివృద్ధి పనులకు సంబంధించిన 194 కోట్ల నిధుల పనులలో ఇప్పటివరకు 149.50 కోట్లు ఖర్చు చేసి అర్ధాంతరంగా కాంట్రాక్టరును 2023లో రద్దు చేసి నిర్వహణ భాద్యతను మున్సిపాలిటీకి అప్పచెప్పిన అనంతరం పనులలో పురోగతి లేదు. ధర్మవరం మున్సిపాలిటీలోని 33,34,35,3637 వార్డులకు సంబంధించిన 11.18 కోట్ల అంచన వ్యయంతో మొదలు పెట్టిన పనులకు ఇప్పటివరకు చేసిన వ్యయం 3.04 కోట్లు మాత్రమే నన్నారు.ఇప్పుడు జిల్లాలో అమృత్ 2.0 క్రింద దాద్దపు 203 కోట్ల రూపాయిల ప్రతిపాదనలు తయారు చేశారు. ఇంత దారుణమైన పరిస్థితులకు కారణం గడచిన 5 సంవత్సరాల అస్తవ్యస్థ విధానాలు. ఇప్పుడు అమృత్ 2.0 క్రింద నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులు సద్వినియోగపరిచి గతంలో పూర్తికాని పనులను పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.పీఎం సూర్య ఘర్ పథకం అమలులో వేగం పెంచాలి, ఈపథకం క్రింద కనిష్ఠంగా 30 వేలు, గరిష్టంగా 78 వేలు సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. స్వయం సేవ గ్రూపులతో అనుసంధానం అయ్యి నిర్దేశించిన లక్ష్యాలు అందుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2,54,688 మంది రైతులు సంవత్సరానికి 6 వేలు కిసాన్ సమ్మాన్ నిధి సహాయం పొందుతున్నారు.ప్రతి యూరియా బ్యాగ్ పైన దాదాపు 2 వేలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, జిల్లాకు 2024 -25 సంవత్సరం ఎరువుల కోసం కేంద్ర ప్రభుత్వం నుండి 68,976 మెట్రిక్ టన్నుల వినియోగం పైన 109 కోట్ల రూపాయిల సబ్సిడీ అందింది. పీఎం కృషి సంచాయ్ యోజన క్రింద డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్లను సబ్సిడీ పైన కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, జిల్లాలో 9,314 హెక్టారులను 116 టార్గెట్ తో జిల్లా రాష్ట్రంలో 4వ స్థానం, దేశంలో 12వ స్థానం సాధించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన క్రింద సూక్ష్మ నీటి వనరుల ద్వారా 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' సాధించి రైతులకు గరిష్ఠ లాభం సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుంది.పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం సహాయంతో 18 రకాల చేతి వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ, 15 వేల రూపాయల విలువైన టూల్ కిట్ మరియు సబ్సిడీ వడ్డీ పైన బ్యాంకు రుణం కోసం జిల్లాలో 15,188 దరఖాస్తులు రాగా, 3,160 మందికి శిక్షణ పూర్తి అయ్యి 1,168 మందికి బ్యాంకుల నుండి రుణాలు ఆమోదించడం జరిగిందన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా మేలురకం పశువుల సంతాన ఉత్పత్తి పెంచడం, ఆవులు , గేదెలను సబ్సిడీ పైన రుణాలు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెంచి గ్రామాలలో నివసించే వారికి అదనపు ఆదాయం చేకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుంది.రాయలసీమ టూరిజం సర్క్యూట్ క్రింద లేపాక్షి పెనుకొండను పర్యాటకంగా అభివృద్ది చేయడానికి 39 కోట్లు స్వదేశీ దర్శన్ 2.0 క్రింద కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుంది. మడకశిర వద్ద పర్యాటక మౌలికసదుపాయల కోసం 4.5 కోట్లు వెంకటాపురం దుర్గా దేవి దేవాలయం, దేవరయ్యస్వామి దేవాలయం అభివృద్ధి కోసం 2 కోట్లు, ముత్యాలమ్మ దేవాలయం అభివృద్ధి కోసం 1 కోటి చొప్పున కేటాయింపులు జరిగాయన్నారు. అంతకుముందు సమీక్షలో స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి పట్టణం చిత్రావతి నదిని సుంద్రీకరణ పనులు చేపట్టాలని, అలాగే ఈ సంవత్సరం రాబోయే నవంబర్ నెలలో శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని. ఈ ఉత్సవాలను రాష్ట్రస్థాయిలో రాష్ట్ర పండగ గుర్తించాలని, అలాగే పుట్టపర్తి పట్టణమంతా సిసి రోడ్లతో ఉండాలని తెలిపారురాయలసీమ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయడానికి నిధుల అవసరమని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, డ్వా పిడి విజయ ప్రసాద్, ఎస్సీ ఆర్డబ్ల్యూఎస్ మల్లికార్జున, హౌసింగ్ పీడీ వెంకట నారాయణ రెడ్డి, డి ఆర్ డి పి డి నరసయ్య, పరిశ్రమ శాఖ జీఎం నాగరాజు, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, టూరిజం శాఖ అధికారి జయ కుమార్, ఏపీఎంఐపి పిడి సుదర్శన్, అగ్రికల్చర్ అధికారి సుబ్బారావు, ఎస్ సి పి ఆర్ మురళీమోహన్, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సోనీ సహాని, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, టిడ్కో అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సంప్రదాయతర ఇంధన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం కల్పించడంలో అధికారులు విఫలం

## బాబా శతజయంతి ఉత్సవాల నాటికి అత్యంత సుందరీకరణ పట్టణంగా పుట్టపర్తిని తయారుచేయాలి

## ప్రభుత్వ 20 సూత్రాల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడంలో ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి సాధించడం లేదని పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ అధికారులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సత్య సాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చేతన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల కమిటీ రాష్ట్ర చైర్మన్ లంక దినకర్ అధ్యక్షతన జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సక్రమంగా అందే విధంగా స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రభుత్వ అధికారులు తీవ్రంగా విఫలమయ్యారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అదేవిధంగా కొత్తచెరువు మండల కేంద్రము లో ఎన్టీఆర్ కాలనీలో నివాసమున్న పేదలకు సరైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుపోయారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వీటికి శాశ్వత నివారణ కోసం అండర్ డ్రైనేజీ నిర్మాణమే పరిష్కార మార్గమని తెలిపారు. అదేవిధంగా పుట్టపర్తి మున్సిపాలిటీలో త్రాగునీటి శాశ్వత పరిష్కారానికి గత టిడిపి హయంలో 138 కోట్లతో మంజూరైన సమగ్ర త్రాగునీటి పథకాన్ని పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతోత్సవాలను రాష్ట్ర పండుగగ నిర్వహించే అవకాశం ఉందని దేశ విదేశాల నుంచి పది లక్షల మంది భక్తులు పుట్టపర్తికి విచ్చేస్తారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అం దుకు తగిన ఏర్పాట్లు ప్రభు త్వం చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందని ఇప్పటిను ంచే ఆయా శాఖల జిల్లా అధికారులు తగిన ప్రణాళికల ను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కోరారు. పర్యాటక రం గాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి చంద్రబాబు నా యుడు ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రాంతాన్ని అత్యంత సుందరీ కరణ నగరంగా తీర్చిదిద్దే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొచ్చేలా జిల్లా అధికారులు తగిన నివేదికలు ఇవ్వాలని జిల్లా యం త్రాంగాన్ని కోరారు. టూరిజం సర్క్యూట్ లో భాగంగా ప్రసాద్ స్కీం కింద 6 కోట్లతో చిత్రావతి నది సుందరీకరణ తోపాటు విద్యుత్ దీపాలంకరణ చేపట్టే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నట్టు ఎమ్మెల్యే గుర్తు చేశారు .ఈ నిధులను సకాలంలో మంజూరు చేసి బాబా శతజయం తోత్స వాలను అత్యంత వైభవంగా ప్రభుత్వం నిర్వహించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రస్తావించిన అంశాలు ఎంతో ముఖ్యమైనవని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పళ్ళు జరిగేలా చూస్తామనీ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ పేర్కొన్నారు.



.చైర్మన్ లంక దినకర్ తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా జె.ప్రకాష్ - జిల్లాలో మరో ముగ్గురికి చోటు

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా హిందూపురం వార్త స్టాఫ్ రిపోర్టర్ జె. ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా శ్రీ సత్య సాయి జిల్లాలో మరో ముగ్గురికి కూడా చోటు లభించింది. ఈ మేరకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎన్నికల అధికారి ఐవీ సుబ్బారావు అధికారికంగా బుధవారం సాయంకాలం ఈ నియామకాలను ప్రకటించారు. ఎన్నికైన నలుగురిలో ప్రకాష్ 25 ఏళ్ల నుంచి జర్నలిస్టుగా హిందూపురంలో సేవలందిస్తున్నారు. అదేవిధంగా కదిరిలో వివిధ దినపత్రికల్లో సేవలు అందించిన చెరువు శ్రీనివాస్ రెడ్డి రెండున్నర దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. జి వి నారాయణ ధర్మవరం నందు వివిధ పత్రికల్లో దాదాపు 25 సంవత్సరాల పైబడి జర్నలిజం ఫీల్డ్ లో పనిచేస్తున్నారు. బుక్కపట్నం, పుట్టపర్తి కేంద్రా లుగా మురళీకృష్ణ దాదాపు 27 సంవత్సరాలు పైబడి పాత్రికేయ వృత్తిలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్టేట్ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ తమ నియమకానికి సహకరించిన రాష్ట్ర ఎన్నికల అధికారి ఐ వి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు పుల్లయ్య, కార్యదర్శి బాబు, ఏఆర్ఓ కదిరి ప్రసాద్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.






ప్రకాష్, శ్రీనివాసరెడ్డి, నారాయణ, మురళీకృష్ణ

# ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కెపి కుమార్ ఎన్నిక - మరో నలుగురికి అవకాశం

అనంతపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యూజె) స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా (2025-2027 కాల పరిమితి) అనంతపురం నుంచి సీనియర్ జర్నలిస్టు, ఏపియూడబ్ల్యూజే మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెపి కుమార్ ఎన్నికయ్యారు. ఆయనతోపాటు కె.రామచంద్ర, పూలశెట్టి చలపతి, లక్ష్మీనారాయణ, దుర్గా ప్రసాద్‌రెడ్డి అనంతపురం జిల్లా నుంచి ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాతీయ నాయకులు డి.సోమసుందర్ జాబితా ను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మొత్తం 84 మంది ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కెపి కుమార్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, జాతీయ నాయకులు ఏపియుడబ్ల్యూజే ఏపి రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ ఆఫీ సర్ డి.సోమ సుందర్, జిల్లా ఎన్ని కల అధికారి ప్రభాకర్ నాయు డు, జిల్లా అద్యక్ష ప్రధాన కార్య దర్శిలు పయ్యావుల ప్రవీణ్, ఆయూఫ్ అహ్మద్‌లకు జిల్లా నాయకులు చౌడప్ప, జయరాం, ఇతర సీనియర్లకు ధన్యవాదా లు తెలిపారు. జిల్లాలో ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘంబలో పేతానికి సంఘ ంలోని అందరి సహకారం, సమన్వయంతో కృషి చేస్తానని ప్రకటించారు. కెపి కుమార్, ఇతర రాష్ట్ర సభ్యుల ఎన్నిక పట్ల సీనియర్ నాయకులు భోగేశ్వరరెడ్డి, మార్కొండే యులు, రాజాహొన్నూరు, బడా శ్రీనివాసరెడ్డి, బివి రెడ్డి, జిల్లా కమిటీ నాయకులు సభ్యులు, ఆత్మీయులు తదితరులు, అభినందనలు తెలిపారు.




కెపి కుమార్ పూలశెట్టి చలపతి,

# ప్లాన్ మార్క్ ప్రకారం రస్తా చూపించాలి

## క్షేత్రస్థాయిలో రెవెన్యూ సదస్సుల అర్జీని తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఆత్మకూరు ఫి బ్రవరి 19 ప్రభాతవార్త

రెవెన్యూ సదస్సులో తమ భూమికి రస్తా చూపించాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అర్జీదారుల రస్తా వివాదంపై సమగ్రంగా వివరాలును ఆరాదీశారు. రెవెన్యూ సమస్యలను తీర్చుటకుగాను ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ సదస్సులలో అనేక మంది రైతులు తమ రెవెన్యూ సమస్యలను ఆర్జీ రూపంలో అధికారులకు అందజేశారు.అందులో భాగంగా రైతులు ఇచ్చిన అర్జీలను ఎంత మేరా అధికారులు నెరవేర్చున్నారో తెలుసుకొనుటకు బుధవారం ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన రైతు నరసింహులు గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రస్తా విషయంపై ఇచ్చిన ఆర్జీని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆర్జీదారుని రస్తా విషయంపై సమగ్రంగా పరిశీలన చేశారు.కలెక్టర్ వినోద్‌కుమార్ అర్జీదారులు,ప్రతివాదుతో మాట్లాడుతూ అన్ని విషయాలు పూర్తిస్థాయిలో ఇరువురితో అడిగి తెలుసుకున్నారు.అందులో భాగంగా గ్రామ మ్యాపును కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదిగుబ్బ గ్రామంలో సర్వే నెంబర్ 120-1లోని తమ పొలానికి రస్తా చూపించాలని రైతు నరసింహులు కోరాడని,అందులో ఇరువులను మధ్య విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, అన్ని పరిశీలించి ప్లాన్ మార్క్ ప్రకారం రస్తా చూపించాలని అనంత పురం ఆర్డీఓ ,తహాశీల్దార్‌లని ఆదేశించారు. మిగిలిన భూమికి సంబంధించి చట్ట ప్రకారం ఎవరికి అయితే హక్కులు ఉంటాయో వారికి హక్కులు కల్పిస్తామని తెలిపారు.ఎవరు ఎలాంటి గొడవలు చేయకూడదని.అధికారులు చట్ట ప్రకారం పని చేస్తారని తెలిపారు.ఎవరైనా భూమి సర్వే సందేశాలకు సంబంధించి ఎఫ్ లైన్ పిటిషన్‌ను సంబంధిత వ్యక్తులతో సచివాలయంలో దరాఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, తహాశీల్దార్ లక్ష్మినాయక్,ఎంపిడిఓ లక్ష్మినారాయణ,వీఆర్వో వీరాంజినేయులు, సర్వేయర్లు మధుర,ప్రియ,వీఆర్ఏలు సర్దాని,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



రైతు పొలంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

# అహుడ అభివృద్ధికి కలిసి పని చేద్దాం పలు ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కి సమర్పించిన అహుడా చైర్మన్ టి.సి.వరుణ్ - తమ సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ భరోసా

అనంతపురం ఓల్డ్ టౌన్ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

వర్గీకరణలో నవీకరణను జోడించి అహుడ అభివృద్ధికి కలిసి పని చేద్దామని అనంతపురము హిందూపురము అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ టీ.సీ.వరుణ్ అన్నారు. బుధవారము ఆయన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ని కలెక్టరేట్‌లో కలిసి అహుడ అభివృద్ధి కోసం రూపొందించిన పలు ప్రతిపా దనలను జిల్లా కలెక్టర్ కి సమర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య అహుడా అభివృద్ధి విషయమై సుదీర్ఘ చర్చ జరిపారు. పట్టణీకరణ విషయంలో మరి ముఖ్యంగా పౌరుల భూ భద్రత సంరక్షణ కోసం చైర్మన్ టి.సి.వరుణ్ తీసుకుంటున్న పలు చర్యలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. మీకు మా వంతు సహకారం సంపూర్ణంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభు తాల సహకారంతో డిజిటలైజేషన్ ద్వారా పౌరులకు భూ హక్కు సంరక్షణ కల్పించేందుకు రూపొందించి అవలంబిస్తున్న గురించి అహుడ చైర్మన్ టి.సి. వరుణ్ వివరించారు.



కలెక్టర్ కు విన్నవిస్తున్న అహుడా చైర్మన్ టిసి వరుణ్

# కేజీబీవీల్లో ఫలితాల పెంపుకు పంచతంత్ర...!

## అక్టోబర్ 21 నుండి మార్చి 1 వరకు వంద రోజుల ప్రణాళిక అమలు - చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి - ప్రతి వారం టెస్టులు, గ్రాండ్ టెస్టులు - ఆన్‌లైన్‌లో మార్కులు ఎంట్రీ, వచ్చిన మార్కులపై ఆరా నిత్యం పర్యవేక్షణ చేస్తున్న డీపీసీ, ఏపీసీ, జీసీడీవో,ఎంఈవోలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్ధినులు గత ఎడాది కంటే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉన్నతాధికారులు పంచతంత్ర పేరుతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు అనంతపురం జిల్లాలో 32 కేజీబీవీలు న్నాయి. ఇందులో పదో తరగతి విద్యార్థినులు 1220 మంది, ఇంటర్మీడి యట్ విద్యార్థినులు 2014 మంది చదువుతున్నారు. గత ఎడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 3640 మంది విద్యార్థి నులకు గాను 2688 మంది పాస్ కావడంతో 73.85 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే గత ఎడాది 1691 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా ...అందులో 918 మంది పాస్ కావడంతో 54.29 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1119 మంది ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు రాయగా...అందులో 845 మంది పాస్ కావడంతో 75.51 శాతం ఉత్తీర్ణత సాధించారు. అయితే ఈ ఎడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఐఏఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పంచతంత్ర పేరుతో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఆ ప్రణాళికలు జిల్లాలో కూడా అమలవుతు న్నాయి. అందులో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థినులను టీచర్ల ద్వారా ఎస్‌వోలు గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అలాగే బాగా చదువుతున్న విద్యార్థినులను ఇంకా బాగా చాదివేలా ప్రోత్సాహిస్తున్నారు. అంతే కాకుండా ప్రతి వారం టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఆ టెస్టులలో వచ్చిన మార్కులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి ఆ మార్కులపై ఆరా తీస్తున్నారు. అదే విధంగా గత ఎడాది అక్టోబర్ 21వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు వంద రోజుల ప్రణాళికలు అమలు చేస్తున్నారు. వీటిని జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రసాద్ బాబు, అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శైలజ, జీసీడీవో వాణిదేవి, ఆయా మండలాల ఎంఈవోలు పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారని ఆరా తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంచతంత్ర ఏ విధంగా అమలు చేస్తున్నారని తెలుసుకోవడానికి కేజీబీవీలను తనిఖీలు చేసి, విద్యార్థినులకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేలా చైతన్య పరుస్తున్నారు. అంతే కాకుండా పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఇటీవల జిల్లా కలెక్టర్, ఏపీసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్స్‌తో సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించారు. ఆ విధంగా అధికారులు ఫలితాల ఉత్తీర్ణత శాతం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు.



రాయదుర్గం కేజీబీవీలో విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న ఏపీసీ శైలజ



నార్పల కేజీబీవీలో విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారని ఆరా తీస్తున్న జీసీడీవో వాణిదేవి

**1 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు జరుగనున్నాయి. ఇప్పటికే ప్రాక్టీకల్స్ కూడా పూర్తి అయ్యాయి.

**17 నుండి పదో తరగతి పరీక్షలు :** మార్చి 17వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి 12:45 గంటల వరకు జరుగునున్నాయి.

**వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికలు : సమగ్రశిక్ష ఏపీసీ శైజల :** ఎస్పీడీ, జిల్లా కలెక్టర్ ఆధ్వ ర్యంలో కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు అందరు వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి పంచతంత్ర పేరుతో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నాము. గత ఎడాది ఫలితాల కంటే ఎక్కువ ఈ ఎడాది ఎక్కుత శాతం ఉత్తీర్ణత సాధిస్తామని ఆశిస్తున్నాము.

# రాజ్యాంగాన్నే దిక్కరిస్తున్న వైయస్ జగన్‌కు రాష్ట్రంలో ఉండే అర్హత లేదు... ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

రాజ్యాంగాన్ని దిక్కరిస్తూ వంశీ లాంటి నేరస్థుల కొమ్ముకాస్తున్న వైయస్ జగన్‌రెడ్డికి రాష్ట్రంలో తిరిగే అర్హత లేదని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. రాయదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో బుధవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ దుశ్శాసనుడి పాత్ర పోషిస్తున్నాడని ధ్వజమెత్తారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసులనే బట్టలు ఊడదీయించి బజారు కీడుస్తానంటూ చేసిన హెచ్చరికలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. బాధ్యత కలిగిన ఓ మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యాలు చేయడం ఆయన పైశాచిక మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా కూడా అనర్హుడని ఆయన స్పష్టం చేశారు. తిరిగి తానే అధికారంలోకి వస్తానంటూ జగన్ పగటికలలు కంటూన్నారన్నారని, రాబోయే 20ఏళ్లు చంద్రబాబే ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్నారు. ఏ పార్టీలోనైనా సాధారణంగా నేరారోపణలు ఎదుర్కొంటున్న నేతలను పార్టీ కార్యక్రమాలకు దూరంగా పెట్టడం ఆనవాయితీ అన్నారు. తరువాత విచారణలో నేరం రుజువైతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. జగన్ పాలనలో టిడిపి కార్యాలయంపై దాడులు చేయించిన వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తే జైల్‌కు వెళ్లి అతన్ని పరామర్శించడం చూస్తుంటే జగన్ నేరస్తులకు కొమ్ముకా స్తున్నట్లు స్పష్టం అవుతోందన్నారు. చట్ట సభలో మహిళల పట్ల నిచ మైన బాషను వాడిన, దళిత యువకున్ని నిర్బంధించి వేధించినా, నేరస్తున్ని వెనకేసుకురా వడం చూస్తుంటే వికృత మనస్తత్వం ఉన్నవారికి జగన్ రక్షకుడిగా తయారైనట్లు అనిపిస్తోందన్నారు. వ్యవస్థలను భయ పెట్టడం, నేరస్తులను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, అత్యంత క్రూరమైన నేరస్థుల మనస్తత్వమని కాలవ ఆరోపించారు. తన ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని అన్నివిధాలా దివాళా తీయించారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు తన అనుభవం, పాలనా సామర్థ్యంతో చంద్రబాబు రాష్ట్రంలో పాలనను ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా రంజకమైన పాలన నడుస్తోందన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు నేరస్థుల పట్ల కఠినాతి కఠినంగా వ్యవహరించడం జరుగుతోందన్నారు. తప్పుచేసేవారు భయపడే విధంగా పాలన సాగుతోందని, ప్రజలఉ బాబు పాలనను విశ్వసిస్తోన్నారన్నారు. జగన్ చెత్త బెదిరింపులకు పోలీసులు బెదరరని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

# సొంత నిధులతో పేదవాని సొంతింటి కలను నెరవేర్చిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

## - ఎమ్మెల్యే రాజు పేదవాడికి ఇంటిని నిర్మించి ఇస్తానని ఆనాడు మాట ఇచ్చాడు ఈనాడు ఆ మాటను నిలబెట్టుకున్నాడు

మడకశిర టౌన్ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త,

మడకశిరం మండల పరిధిలోని హెచ్ఆర్ పాళ్యం గ్రామంలో లక్ష్మీదేవి నరసింహప్ప అనే పేదవాని సొంతి ంటి కళను నెరవేర్చే విధంగా టిటిడి బోర్డు మెంబర్ ,ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు . తన సొంత నిధులతో దాదాపు 7 లక్షల రూపాయలతో లక్ష్మీదేవి భర్త నరసింహప్పకు ఇంటిని కట్టించి ఆ కుటుంబానికి తాళాలు ఇవ్వడం జరిగింది, బుధవారం మడకశిర మండల పరిధిలోని ఆమిదాల గొంది పంచాయితీ హెచ్ఆర్ పాళ్యం గ్రామంలో లక్ష్మీదేవి భర్త నరసింహప్ప ఇద్దరు చిన్నారులతో కలిసి మరుగుదొడ్డిలో 8 సంవత్సరాల నుండి జీవనం సాగిస్తూ వస్తున్నారు, ఈ విషయం.పలు దిన పత్రికలలో కథనం రావడంతో ఆ కథనాన్ని చదివి ఆ కుటుం బాన్ని పరామర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ: లక్ష్మీదేవి భర్త నరసింహామూర్తి ఇద్దరు చిన్నారులతో కలిసి ఈ కుటుంబం దాదాపు 8 సంవత్సరాల మరుగుదొడ్డిలో జీవనం సాగిస్తూ వస్తున్న విషయాన్ని కనుక్కొని కల్లారా చూసి మనసు కలిచి వేసి ఈ కుటుంబానికి ఇల్లు నిర్మించాలని నిర్ణయం ఆరోజు తీసుకోవడం జరిగి ంద న్నారు ,కొంత ఆర్థిక భరోసా కల్పించి అనంతరం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఈ స్థలానికి పట్టేంచడం జరిగిందన్నారు. ఈ కుటుంబానికి నేను మాట ఇచ్చి న విధంగానే నా సొంత నిధులతో ఆ కుటుంబానికి ఖి గృహాన్ని నిర్మించి ఈరోజు కుటుంబ సభ్యుల చేతికిఖితాళాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి మాట్లాడుతూ: ము ఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబులు ఆశీస్సుల తో హెచ్ఆర్ పాళ్యం గ్రామంలో లక్ష్మీ దేవి భర్త నరసింహా మూర్తి కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా మరుగుదొడ్డి లోనే నివసిస్తూ జీవనం సాగిస్తూ వస్తున్నారన్న విషయం తెలుసుకున్న మన ఎమ్మెల్యే రాజు ఆ కుటుంబానికి తన సొంత నిధులతో ఖి గృహాన్ని నిర్మించి ఆ పేద కుటుంబానికి ఇంటి తాళాలు అప్పగించడం జరిగిందన్నారు. మమ్మల్ని పరామర్శి ంచి ఆరు నెలలు ఇంటి అద్దెను తన సొంత నిధులతో అతని స్వయంగా ఇచ్చి. ఎమ్మెల్యే సొంత నిధులతో మాకు ఇల్లును నిర్మించి ఈరోజు ఎమ్మెల్యే దగ్గరుండి గృహప్రవేశం చేసి ఇల్లు తాళాలు మా చేతులకు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు మా కుటుంబం తరపున చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ బలరాం నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



సొంత నిధులతో ఇల్లు నిర్మించి రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం..! ఎమ్మెల్యే రాజు

మడకశిర టౌన్ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త,

మడకశిర పట్టణం లో ఉదయం టీ టైంలో అమరాపురం బస్టాండులోని ఒక టీ బంకు దగ్గర ఒక సామాన్యుడిలాగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆటో డ్రైవర్లు,హమాలీ పని చేసే కూలీలతో పాటు కలిసి టి బంకు దగ్గర ఎమ్మెల్యే రాజు టీ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ప్రజా సమస్యల పరిష్కారానికే తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అన్నారు. బుధవారం ఈ టైంలో ఎమ్మెల్యే రాజు ఈ బంకు దగ్గర టీ తాగుతూ ప్రజలు వృద్ధులు రైతులతో మమేకమై వారికి ఉన్నటువంటి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు, తాను ప్రభుత్వం ద్వారా ఏవిధంగా సహాయపడాలని అడిగారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మీ ముందుకు వచ్చానని ఎమ్మెల్యే వారికి తెలిపారు, హమాలి పని చేసే మూటలు మోసుకుంటూ జీవనం సాగించే నాకు అనారోగ్యం కారణాలవల్ల పనిచేయలేకపోతున్నానని ఓ హమాలి పని చేసే వ్యక్తి ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు, త్వరలోనే నీకు పెన్షన్ వచ్చే విధంగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే అతనికి భరోసా ఇచ్చారు, అక్కడే ఉన్న ఓ రైతు నా పొలంలో బోరు వేయించమని అడగగా వెంటనే ఎమ్మెల్యే స్పందించి రైతుకు పొలంలో వ్యవసాయ బోరు వేయించే విధంగా అధికారులకు చేరవాణి ద్వారా ఈ రైతుకు బోరు వేయండి అని మాట్లా డడం జరిగింది వెంటనే రైతుకు త్వరలోనే మీకు మీ పొలంలో బోరు వేయించగలు గుతానని ఎమ్మెల్యే చెప్పడం జరిగింది, అక్కడ ఉన్నటువంటి రైతులు, హమాలి కూలీలు, ఆటో డ్రైవర్లు,ప్రజలు, ఎమ్మెల్యే రాజుతో దాదాపు రెండు గంటల పాటు ఈ బంకు దగ్గర మాటామంతి జరపడం జరిగింది, అక్కడ ఉన్నటువంటి ప్రజలు ఎమ్మెల్యే రాజు పనితీరును చూసి కృతజ్ఞతలు తెలియజేశారు,



కూలీలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజు

# ఆర్డీటి, దాతల సహకారంతో పోలీసు రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌కు 40 టేబుళ్లు అందజేత

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ఆర్డీటి మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్, భవిష్య ఇరిగేషన్స్ యజమాని చల్లా శ్రీనివాసులు పోలీసు రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌కు 1.40 లక్షల రూపాయల విలువైన 40 టేబుళ్లను అందచేయడం పట్ల జిల్లా ఎస్పి జగదీష్ వారికి అభినందనలు తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను జిల్లా ఎస్పి జగదీష్, ఆర్డీటి మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్ సందర్శించారు. అనంతరం వారు పిల్లలతో కాసేపు ముచ్చటించారు. స్కూల్‌లో వున్న సౌకర్యాలు, తరగతుల నిర్వహణ, పరిసరాలను పరిశీలించారు. పోలీసు పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని ఆర్డీటి సంస్థ ఇదివరకే స్పానిష్ టీచర్‌ను ఏర్పాటు చేయడం సంతోషించతగ్గ విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డిఎస్పి శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి నీలకంఠేశ్వర్‌రెడ్డి, సిఐలు క్రాంతికుమార్, ధరణీకిషోర్, విశ్వనాథ చౌదరి, ఆర్ఐ మధు, ఆర్డీటి హౌసింగ్ విభాగం డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్ ను ప్రారంభిస్తున్న దృశ్యం



పాఠశాలలో టేబుల్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

# సైబర్ నేరాలు నిరోధించాలంటే అవగాహన, అప్రమత్తం ముఖ్యం - అదనపు ఎస్పి డివి రమణమూర్తి



అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పి డి.వి రమణమూర్తి



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, తదితరులు

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

జిల్లా ఎస్పి ఆదేశాలతో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ సురక్ష మన భద్రత - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సును అదనపు ఎస్పి డివి రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నేరాలు అధికంగా చోటు చేసుకుంటున్న తరుణంలో జిల్లా ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా అవగాహన తీసుకరావాలనే సంకల్పంతో జిల్లా ఎస్పి జగదీష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. 3 డిజిటిల్ వాహనాలను రంగంలోకి దింపి సైబర్ నేరాలు నిరోధించడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్ట్, ఫేక్‌లోన్ యాప్స్, ఏపికె ఫైల్ లింక్స్, షేర్‌మార్కెట్ మోసాలు, కొరియర్ ఫ్రాడ్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా వచ్చే వీడియోకాల్స్, ఆర్థిక నేరాలు, తదితర వాటి గురించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలియచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సీనియర్ సిటిజన్స్, అసోసియేషన్ రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ పోలీసు అధికారులు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

నియోజకవర్గ వ్యాప్తంగా ఆపద కాలంలో సొంత డబ్బుతో చికిత్స పొందిన పేదలకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 7,32,206 రూపాయలు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.